# చీకటి మనుషులు

పద్దినాలు సలిజరంతో మెల్దిరిగి పోయిన యానాది ఎర్రాయి, నిన్నా మొన్నా కాత్తె సుమారు గుంటాన యానాది గుడిసెల ముంగల రాత్తా పక్కన సింపెట్టు కింద కాత్తెకూత్తె ఎండ తగిలీ తగలక, ఎచ్చెచ్చగా సల్లసల్లగా- పైపంచ మొగం, సెవులు బయటి కుండేట్టు కప్పుకుని, వొత్తా పోతా వుండే జనాన్ని సూత్తా కూకుండాడు.

కాత్తె సుట్టపాయకో, ఏలెడి బీడీముక్కకో మద్దె మద్దె అలవాటుపడ్డ పానానికి పద్దినాలు సల్జెరం గిల్జె వంటూ వొచ్చి పడేతలికి కుతి ఎంత లెక్కకు లెగిసేదీ ఆట్టుంచి, యీ పద్దినాలూ కాలూసెయి ఆడక- దొరికితే గిరికితే- ఆ నాలుగు గింజలూ ఎనిక్కి- బోయేతలికి ఆ కాక యీ కాక సేరి నిక్కాక బుట్టిన మడుసులయవారం బెమ్మదేవుణ్ని పుట్టిచ్చి నోరికి తెలవాల్సిందేగాని సిప్ప కడుపు ఎర్రాయికీ, ఎర్రాయిని సూత్తా కూకుండ పెల్లాం ఈరావుకూ తెలిసొచ్చేదేం లేదన్న మాట.

అసువంటి సమయాన- ఆవజాన అట్ట సూత్తాకూకుండ ఎర్రాయి సుట్టూతా అయిదారుగురు పిల్లల్తో ఎదురింటోరి కోడిపెట్టా, బర్రెపడ్డ, బొనిక నాక్కుంటా ఎగుర్తుండ సుందోళ్ల కుక్కపిల్లా, బెల్లంగెడ్డ నాక్కుంటా, సప్పరిత్తా సుబ్బయ్య కొడుకు సూరయ్యా గిర్గిరా తిరుగుతా వుంటం బొహు యిబ్బంది గుంటదన్న మాట.

అంతలెక్క వూపిరి పీక్కుంటా అటనే కూకుని- సెక్రకం దిరిగినట్టు యిట్ట ఎర్రాయి సూరయ్య బెల్లంగెడ్డ కల్లి సూసేతలికి సూరయ్యతో బెల్లంగెడ్డా, అయిదారుగురు పిల్లల్తో కోడిపెట్టా, బర్రెపడ్డ, బొనికతో సుందోళ్ళ కుక్కపిల్లా ఎటుగా ఎగిరెల్లిందీ ఎర్రాయికే అంతుబట్టలా.

"ఏం యాన్దారా ?"

ఎంటనే తెప్పరిల్లుకుని సూపు గురిజూసుకుని సూసేతలికి ఎర్రగెళ్ళ లుంగీ గుడ్డా, నల్లెంటికల బిరుసుగడ్డం ఆడ్తా అగుపించినై ఎర్రాయికి.

మరెందుకనో తెలవదుగాని ఆ నల్లగెడ్డాన్ని ఎప్పుడు తలుసుకుంటా మొగమ్మీన కొచ్చి కూకుని రుద్దుతావుంటున్నట్టసిపిస్తద్ది ఎర్రాయికి.

"సలాం మోతాచ్చాయిబయ్యా" అన్నాడు ఎర్రాయి.

"ఈ దొంగసలావులు మాఖాద హెందుకులేవోయ్ ! ఎక్కా కనుపించటం

లేదు గిరాకేవఁన్నా, తగిలిందేఁటి?"

"గిరాకేం దయ్యోవ్ సాయిబయ్యా!"

"పగల్ కనుపించ్కాపోతే హడిగాన్లేవోయ్."

"సల్లెరందగిలి గుడిసిలోనే పొండుకుంటినిగా-"

"వా! యీ ఏడు సెహ్వాపాట ఆరొంద లేఖయికీ పైసల్ హాయిందీ తెల్సాగా? అయినా సెర్వా గిర్వా మీకీ మాకీ దేన్కీ షెప్పు-అరే సాబ్ పైసా, పైసా భోడ్ జాతా- జాతా- వా!" టపటప లుంగీగుడ్డ కొట్టుకుంటూ ఎల్లిపొయ్యాడు మోతాచ్చాయిబు.

"తల్మొండమొయ!- ఆరొందలయాభై కాడికి పాట లెగవదీసి సెరువు లాగేసుకుండా రన్నమాట! ఆ వాసన అప్పుడే తగిలిందిలే యిగదేనికి"-

"యిదిగో కాత్తె సుట్టపాయుంటే పారేసెల్లు దొరా!" అనడిగాడు ఎర్రాయి అటుగా బోతుండ రాగవయ్యను జూసి.

"ఇదిగో - అడకేబోతుండా-" అంటానే అంగలేసుకుంటా ఎల్లిన రాగవయ్య మొదులు ఏమంటా బోయిందీ అంతుబట్టలా ఎర్రాయికి.

నాగయ్య వొత్తావుంటం జూసి సేతులు కాళీగ వొదిలి కూకుండాడు ఎర్రాయి. నాగయ్యకు గూడెంలో గుడిసెల్లోగాని బీడీముట్టిచ్చుకోను నుప్పుదొర కదని ఎర్రాయికి తెల్సు.

"ఒ ఏవిండోయ్-" అంటున్నాడు ఎర్రాయి.

"ఇదిగో నాగరత్తమ్మ గుడిసెలో వుండదంట్రా ఎర్రాయ్ - కాత్తె పనుండదిగాని వుండదంట్రా ఎర్రాయ్. రైట్-" గబగబనన్నాడు నాగయ్య ఎళ్తానే.

"బీడిముక్కుంటే పారెయ్యండి-"

"వుండు - వుండదా - రైట్ - వత్తానుండు-" అంటా ఎల్లిపోయిన నాగయ్యకు నాగరత్తమ్మ గుడిసెలో తొందర పన్లుండయ్యను కుండాడు ఎర్రాయి.

ఇప్పటికి ఎక్కినన ఏడి సాలనుకుంటా లెగిసి గబగబ గుడిసెకొచ్చాడు ఎర్రాయి.

"ఏందయ్యా సూరుకల్లి నువు సూసేదీ?" అంది సూరుకల్లి సూత్తా పొండు కుండ యీరాం

"ఈడ గాలాం వుండాలి అగుపియదేం- సూడు దొబ్బనా-" అంటూ

ఎర్రల గొబ్బిరిసిప్పకు దేవులాడ్తుండాడు ఎర్రాయి.

* * *

ఆ యీత పొదల సాటున సెరవు వొడ్డుకాడ ఎవరయినా పని పెట్టుకు పరీచ్చగా సూత్తేగాని గాలంతో కూకుండ ఎర్రాయి అగుపియడు

ముంగల పిల్లకాలవలకాడికి ఎల్లిన ఎర్రాయికి అంత దూరం ఎల్లినాకగాని ఎండలకు ఆడ నీలు యిలగర్సుకు పోయినట్టు తెల్చిరాలా. కాసినికూసిని మిగిలుండ వొంట్రదు నీలబురదల్లో దున్న కుర్రలు పొర్లాకాల్సిందే గాని బుద్ధిగల శాపలు పిల్లాజల్లాతో కాపరాలు సెయవని వాటి బతుకు తెరువులు తెల్చిన ఎర్రాయికి తెల్చు. కూడు దొరక్కబోతే ఎతుక్కుంటా ఎల్లే మద్సుల్లాగా, ఎసువంటెసువంటి శాపల కుటుంబాలు యిసువంటి పిల్లకాలవల కుండా అట్టట్ట ఆడనాగుల్సెరువుకు చేర్తయిగందా !

సెరువుకల్లి సూశాడు ఎర్రాయి ముక్కులాడిస్తా. అసువంటికమ్మటోసన అసువంటిశాపలకే వుంటదిగందా! రుసిదెల్సిన ముక్కులు సెరువుకల్లి తోసుకు పోతావుంటే, బెదుర్తుండకళ్లు ఏడేడ ఎసువంటి జనం ఎటెటుగా సూత్తావుండదీ కనిపెడ్తావుంటే – ఎల్లి సెరువువొడ్డున యీతపొదల సాటున కూసుండాడు ఎర్రాయి.

కదలక మెదలక వొక్కసారి సెరువుకల్లి కలియజూశాడు ఎర్రాయి. ఆడ సొరంగం అగుపిచ్చింది ; ఎర్రాయికి ఆడే రతలునాండయి, జిలేబీలుండయి, పొకోడీలుండయి, పొప్పుండలుండయి, గొబ్బరిముక్కలుండయి, ముంతకజ్జాయం వుండది.

పిట్టా గిట్టా, గొడ్డూగోదా ఎండదెబ్బకు ఆవులించేయాల – యిళ్లల్లో కుండల్లో కూకుని తపనబడ్తుండ వూరి జనానికి యీడ సొరగంతో పనుండదని ఎర్రాయికితెల్చు

"ఎపుడా ఎదవ సెరువు పాటపాడేది? మోతాచ్చాయిబు పొళ్ళొడ్తయి! గెడ్డం ఆడాల !"

'ఎంతన్యాయం! యిన్నేళ్ళసించీ యీ ఏనాదోళుగాదూ సెరువుపాట పాడ్తుండదీ? అయిదొండల యాభైయ్యయిదుకు పాట పెరుగుద్దా! యానాదోళ్ళను దెబ్బగొట్టాలంగాని, పాట పెంచుతా పోతావుంటే ఎవడువటుకేం పీక్కదింటాడూ? మొదలాపాట పాడిందెవుడంట? ఆడికేం దెల్సు శాపలెవారం? ఆటి వాసనేందెల్సు? అసలు ఎవడంట ఆట్ని బట్టేది? యీ ఏనాదోళ్లగ్గాకూ ఆట్ని

ఎట్టబట్టేది తెల్పిందీ?"

ఇసిరి లాగాడు గాలాన్ని ఎర్రాయి. దగదగ మెరిసి బోతా ఎగిరెగిరి పడింది గొబ్బరిముక్కశాప.

"దా బయటకి రా." అన్నదా కంఠం. జిలేబీలు, పకోడీలు, పొప్పుండలు, గొబ్బరిముక్కలు, సెక్కిరాలు, ముంతకజ్జాయం అంతరిచ్చానికి లెగిసినై. బొక్క బోల్లా నీలల్లో పడిన నల్లగెడ్డాన్ని, తెల్ల గుడ్డల్ని సూత్తావుండ ఎర్రాయిని ఆడీద వొంటీమీన సవరదీసి జుట్టు బట్టుకు గెట్టిక్కిచ్చాడు మోతాచ్చాయిబు.

'క్యావ్‌రే బోసడీ?' కండల్దిరిగిన సేతులుండయి మోతాచ్చాయిబుకు.

'వూరకనేలే—' అన్నాడు ఎర్రాయి, యీపు కానుకుంటూ.

'ఏ క్యావురే—'

'ఏహె వూరకనెలే—'

'ఎవుడి బాబు సొమ్మురే—'

'అనిగదిలే—'

'సాడే సౌపాంచ్ రే—'

'జరం తగిల్తే సీ—'

'శాపల్ ముందురాబే—'

'వుక్—వుక్—'

'జావ్ బోసడీ - ఏదీ - ఏమన్నా వుండయ్యా'

* * *

'ఏవన్నా పడ్డయ్యా?' అని యిశారిచ్చింది యీరాం.

'ఏంది పడేది - అరవమూక—' అన్నాడు ఎర్రాయి గాలాం మూలబారేసి కూకుంటూ.

'అరవమూకా? మరి యాడకి నువు గాలాంవీసుకునెల్లిందీ?'

'ఎ లే ఏంలే—'

"ఎలే ఏంలే! యిదిగో నయ్యోవ్, కాలీసేతులాడిచ్చుకుంటా నువుగాంగా వొచ్చావు నీ; ఆ సీతమ్మగోరూ లచ్చుమ్మగోరూ పైనెలజీతంలో రాబట్టుకోమని పావలాబిల్ల అడిగితేనీ సేతులాడిచ్చుకుంటా మీనమీన కొచ్చారు. మరికూడు యాణ్ణుంచి వొచ్చుద్దో అమీన సీయిట్టుమయ్యా"

"ఇంతకన్న సెదేదేం వుండదే! యియ్యాలేం కొత్తగాదుగా మనకి!"

"అయితే తల్వాలు పాడుకుంటా సావమనా నువనేదీ?"

"ఇన్నాలమించీ సచ్చావంటే - పౌళ్ళాడదన్నంట్రా!"

"పూడదందువులే కడుమ్మాడ్సిసంపుతూ. మొగుడంటే యిట్టనే వుండా లంటాడు గావాల్ను బెమ్మదేవుడు!"

"ఒచేవ్ పెల్లావంటే కాడికిమల్లే కరుసుకూ్కకుండేదంటే?"

"మరెందుగ్గట్టి కోవాల నన్ను?"

"ఎవురు, నేనా? నువుకట్టుకోలేదంటే నన్ను?"

"మా అయ్య కట్టుకోమంటే కట్టుకున్నా"

"అయితే నీకు మొగుడక్కర్లేదంటే?"

"ఆఁ అదెట్టా - సాల్లేవూర్కో!"

"ఇదిగో, మొగోడి రందిలేని వొక్కఆడగూతుర్ని యీ బెమ్మాండం మొత్తమ్మీన సీపిచ్చు, నీకాలికింద దూరకబోతే అప్పుడను."

"మొగోడికే వుండది ఆడరంది."

"ఇద్దరికీ వుండదన్నాదంటే?"

"ఆదేమో - కూడుబెట్టని మొగాడేం మొగుడంటా?"

"నీకు పెట్టకుండా నేనే పీక్కదింటన్నానంటావ్?"

"మొదులుంటేగా ఆడా?"

"కల్చిరాకబోతే ఎన్నయినా అంటావులేయే–"

"నేనేం అన్లా అన్నిన్నీ."

"మరేందే నీమాటా?"

"నేనేం ఆట్టల్లా - ఎగరమాక–"

"బొంబిడాయి మొగాలుంటయ్యే–"

"నీకుండలా పీత మొగం–"

"కౌపూ్పడుద్ది–"

"మొగోడు గాలాందీసుకుబయలెల్లాడు తెల్లారంగానే!"

"అది గందుగ్గదంటే నువు యిందాకట్నుంచీ రాగాల్దీత్తుండదీ? నాకు తెలదంటే నీతంతూ? ఆ, నే ఎదవనే అనుకో; ఏపనికీ శాతగాని నకోర్కరు పచ్చినే అనుకో- యిగ సరేనా?"

"ఏందయ్యా అంతలావుమాటలు రానిత్తావ్? శాపలు పట్టుకొత్తావని యీ వర్దాకా కూకుని కూకుని సోసొత్తావుంటే ఎందుకయ్యా అట్ట మీన మీన కొత్తావ్? పడిలేసినోడివి నీకు మటుకు తెలవదంటయ్యా కడుమ్మంటా? ఏవో, యాడేం

దిన్నావో ఎవ్వరికేం దెల్సుద్ది! అందుకే గావాల్ను వొచ్చినేల్నుంచీ కసురుకుంటా కూకుండావు. అసలెందుకులే మొదులీ పెళ్ళాం పచ్చంచేనే సీకురోత పుడ్తుందె--పాసీలే - యింకెన్నాలుంటది-"

"చెప్పదీసుకు తన్ను దొంగగెడ్డి తిన్నోణ్ని, పొలుగు దిగెయి బూటా కోరయితే"

"ఇగ దేనికిలే-"

'అట్టన మాకే - యిదిగో, యీ ఎర్రాయంటే యింతేనంటే తెల్పిందీ-'

'దెగ్గిరికి రామాక - యాడకి అట్ట జరుగుతావ్-'

'జరగన్లే, సెర్లో శాపలు పొట్టుకోసీయటంలా మోతాచ్చాయిబు-'

'ఆడి మొదులార-'

'నాలుగు పీకుదునుగానీ - రూలట్టుందని-'

'ఈడి జిమ్మడా, రూలేందీ - మునిసీబుకు ఈడుగాదూ తార్చేదీ?'

'మొదులు యీవేటి సెరువుపాట మనోళ్ళకి దక్కనీకుండా సేశారు గదంటే!'

'అయ్యో బగమంతడా, యాపారం యిటుగా మల్లుతుందది గావాల్ను!'

'అసలాడ నీకూ నాకూ తెలవని వలేసే మొగోడెవడుండాడే?'

'సెనేశరం పట్టుద్దిలే!'

'శాన్సు సూడంది వొదుల్తాగా-'

'కా త్తె దెగ్గిరకిరా...'

* * *

'ఎంకాయ్?'

'ఏందిరె రాయ్? కా త్తె వుసులుగుండదా?'

'ఇన్నాళ్ళంట ఎంకాయ్? సెరువుపాట తన్నికెల్లార్రా.'

'ఇనకుండా ఎట్టుంటాంరా ఎర్రాయ్. అంజియ్య జేశాడ్రా యిదంతా.'

'ఎవురు జెమ్మలయ్య బామ్మరిదీ అంజియ్యా!'

'ఆఁ ఆ పెద్ద దెచ్చి. సెక్రకంచిప్పినట్టు తిప్పాడుగా పాటనీ! యిన్నాలం మించి సెరువులోలికి పోలా యీ పెద్దమన్సులు!'

'మునిసీ బేసున్నాడూ?'

'మొదులు యవార్గం యీపజాన తిరగనే తిరగ్గూడ్దుగాని మునిసీబేం జేత్తాడు ఆరారంటా వొకటయితే!'

'నేనుండక బోతినాడ–'

'ఓరీపోరా నువు నేనేంది పెద్దోడు పోలిమావేఁ ఆవజాన కూలిపోతేనీ!

'ఇగ ఎట్టారా బతికేదీ!'

'ఎట్టనేం వుండదీ, రాలుదిని బతకాల్సిందే - ఆటికీ యాపారం తగల కుంటే.'

'కడుపుడుకుతుండదీ.'

'మెల్లిగంటావేం?'

'మోతాచ్చాయిబు కొట్టాడ్రా ఎంకాయ్. యీరావుకు తెలుస్తే ఏడుస్దద్ది.'

'ఆఁ–!'

'పిల్లకాలవలు అప్పుడే ఎండుకు బోతయ్యాని నాకేందెల్సొచ్చిద్దీ? మద్దానం యిట్టబొయిసూస్తే యిగనేం వుఁటది వొంఁడ్రు బెత్తెలు దప్పా! ఆమైన ఆయీాత పొదలకాడికి సూసొద్దామని యిట్టబొయినా - యిగనేం వుండది ఎనికీద్దే వొచ్చి పెడీపెడీమఁటా అదేమయిన బాదాడు.'

'ఎవురు, గెడ్డంవోడు?'

'ఆడె యదవ.'

'ఆణ్ణోకంట కనిబెట్టాల్సిందే...'

'ఏవఁన్నా ఓపావల్డబ్బులుంటయ్యంట్రా ఎంకాయ్?'

'మనచంగతి నీకుతెలవఁదేఁ వుండదిరా ఎర్రాయ్?'

'అంతేలేరా ఎంకాయ్.'

'సెన్దగులుకుండదిలేరా ఎర్రాయ్.'

'బీడీముక్కుండదా?'

'ఎట్టరా ఎర్రాయ్, యింతకు ముఁగలే చివయ్యే ఓముక్క బారేస్తే కాల్చేస్తినే!'

'దానెమ్మ పానీలే.'

'కుతి గదంట్రా'

'ఎంకాయ్?'

'ఏందర్రెరాయ్?'

'సీకాడ పెద్దవల వుండదిగదంట్రా?'

'వుండదిగా!'

'ఏంలేదుగానీ రాత్తిరికి ఓకోపేవన్నా కాస్తావా?'

'తల్మొండమొయ కాయాల్సిందే !'

'పులిగాదేవన్నా సెయి గలుపుతాడంట్రా ?'

'ఆ దెప్పుడా అని రెడీగుంటాడు.'

'రే త్తిరికి ?'

'రే త్తిరికి.'

*　　*　　*

నిశిరే త్తిరి కారుసీకటి. ఏడ ఎవురుండదీ అగుపియదు. సచ్చింత్రాలు సెరువు నీలల్లో మెరుత్తుండయి. సీకటి సల్లగా సూసుకుని యసదానం దొరికిందంటా ఎగిరెగిరి పడ్తుండయి బల్సిన శాప్పిల్లలు. ఎండ దెబ్బతిన్న వూరిజనం పానాలు సొమ్మసిల్లి ఎప్పుడో పొండుకుండై. అడుక్కుదినేవోళ్ళు యీదులెంట అగుపియటొయ్యేతలకి తోకముడుసుకు అప్పుడే పొండుకుండై సుండోళ్ళకుక్కలు. అసువంటి నిసిరేత్తిర్న యాడమటుకు ఎవ్వరికేం పనుంటది ?

నాగుల్సెరువు దచ్చినపు దిక్కున నాగజెవుండు పొదలమాటున ముండు యిగ్రహాలు కూకుని నిక్కి నిక్కి సూత్తుండయి మినుకు మినుకంటుండ కళ్ళతో.

'ఎంకాయ్ ?'

'ఏందిరెర్రాయ్ ?'

'పులిగా ?'

'ఏంది రెర్రాయ్ ?'

'కూసేపు సూద్దాం.' అన్నాడు ఎర్రాయి.

'సూత్తేనే నయం.'

'యెందుకయినా మంచిది.'

'సూద్దావంటరా ?' అన్నాడు ఎర్రాయ్ ఒక్కచనం ఆగి.

'సూసేదేంది సప్పగా యాడజనం అద పొండుకున్నైపోతే ?'

'ఈడ కిసిపిత్తుంటే గురకలు ?'

'ఆరికేం మారాజులు !' అన్నాడు ఎర్రాయ్.

'గడిసినోడల్లా మారాజే ?'

'బలే మాటన్నావులే !'

'మరదేందో వనకి గడవకుండా వుండది.' అన్నాడు ఎర్రాయి.

'గడుత్తే యీా పన్దేనికి ?'

'గడపటవేం వుంటే యిసువంటి బొంబిడాయిలు ఎన్నొచ్చి నోటిముంగల

కూకుండా వుమ్మూత్తా.'

'మన అయ్యోళ్లు యిసువంటి బతుకు బతకలేదనిపిచ్చుద్ది' అన్నాడు ఎర్రాయి.

'శాపలుదిన్నా పట్టపగలు తిని బతికారు.'

'ఒక్క ఎదవా కిక్కురుమన్లేదుగావాల్ను!'

'అంజియ్య ఆరోజుల్లో శాపలేపారం పెట్టలేదుగా?' అన్నాడు ఎర్రాయి.

'మనోళ్ళు బొమ్మలాటాడ్తె యాడజనం ఆడ నోళ్ళు దెర్సుకు సూసేవోరు!'

'బాగోతం ఆడ్తెనో?'

'తలాబత్తా గింజ లిచ్చేవోరు- యిప్పుడెవుడంట మనకల్లి సూసేది?' అన్నాడు ఎర్రాయి.

'చినిమాలొచ్చి కూకుండెగా?'

'గాసులైటునాటకాలు రుసిగుండే!'

'ఓరిపోంర్డా, అట్నీ మనోళ్ళు ఆంవల్లలెక్క నడిసి సూసిరాటంలేదంట్రా!' అన్నాడు ఎర్రాయి.

'ఆ మాటకొస్తే నిజమంతేలే.'

'అవుననుకో.'

'ఇంతకీ రోజులు మార్తుండయిలే, మరి మనసంగతి సూదబోతే ఎనిక్కెనిక్కిబోతా వుండె.' అన్నాడు ఎర్రాయి.

'ఎనిక్కేంది డొక్క పీక్కుబోతావుంటే?'

'పడమర పక్కనుండ మా మరదలోళ్ళు బురద నీలు దాగి సచ్చారు.'

'రేపో మాపో మనపనీ అట్టవదని గ్యారంట్రీఏందంట' అన్నాడు ఎర్రాయి.

'ఇగ సత్తేనే గ్యారంట్రీ!'

'సొరగంలో గ్యారంట్రీ బొహుకమ్మగుంటుందంటలే'

'సత్తే యీ సెర్లోనన్నా పడిసావాల్సిందేగాని ఏందంటా నాసిబతుకు?' అన్నాడు ఎర్రాయి.

'ఎహె దిగండి సూత్తారేం?'

'తియరేందిరా వలా, యాల మిగిలిపోతుంటే.'

'మోతాచ్చాయిబు గెడ్డం పీక్కుదినాల్సిందే.' అన్నాడు ఎర్రాయి గెంతేసి నిలబడ్డా.

'సాయిబుకూ జై.'

'అంజియకూ తొయ్–ఏందదీ–'
'ఎప్పుడో వొత్తుండాద్రా–'
'సచ్చాంరా బగమంతడా–'
'దొంకలోకి– లగెయ్–'
'అమ్మ మోటాచ్చాయిబురో రెంకాయ్–'
'లగెయ్ లగెయ్– దొంక్– దొంక్–'

దబదబా, గబగబా, టపటపా కాళ్ళు కొట్టుకుంటా వొచ్చి నిలబడిందా యిగ్రహం.

'ఆరె తేరేమాకీ– మెవుద్రా బోసడీ–కడోరే సువర్' అన్నదా యిగ్రహం ఎంటికలు కొరుకుతా.

వుసిగలిపిన సుండోళ్లకుక్క లగెత్తినట్టు లగెత్తిన లగెత్తటం, గుమ్మం కాడికొచ్చి గుమ్మంలో కూకుండ యీరావునుసూసేతలికి, మొగశాసతో గుండె రోజాపొట్టు పట్టినట్టయింది ఎర్రాయికి... ... ... ...

('సమీక్ష'లో ప్రచురణ)

*